క్లుప్తంగా

మాజీ జెడ్పీటీసీని పరామర్శించిన హనిమి రెడ్డి



పున్నయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని కుందుర్రు గ్రామానికి వైఎస్సార్‌సీపీ మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు తండ్రి పున్నయ్య (75) ఇటీవల మృతి చెందారు. గురువారం పెద్ద కర్మ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కైపు మహేశ్‌రెడ్డి, నియోజకవర్గ స్థాయి నేతలు, మండల, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులున్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి



పంగులూరులో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

జె.పంగులూరు: గత మూడు నెలలుగా ఆగిపోయి ఉన్న ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధి పనులు వెంటనే చేయించాలని కోరుతూ, పంగులూరు దళిత కాలనీ ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం పనులు లేక, అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉపాధి పని ప్రారంభించి ఒక నెలలోపే మళ్ళీ నిలిపివేశారని, అప్పటి నుంచి పనులు లేవని తెలిపారు. తక్షణమే రావలసిన బకాయి డబ్బులు మొత్తం వెంటనే ఇవ్వాలని కోరారు. సందిపోగు ఏసోబు, పాలపర్తి నిర్మల, పున్నమ్మ, పి. నాగవర్ధన, ఎండ్లూరి నాగమణి, పాలపర్తి చిన్నబ్బాయి. పాలపర్తి కృపయ్య, మేర్సీ, శాంతి, ఎస్తేరమ్మ, పాలపర్తి లోకయ్య, రోజా, మాధవి, సుజాత, వెంకయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

జె.పంగులూరు: రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేసిన ధర్నాకు అధికారులు స్పందించారు. దొంగలు తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో బుధవారం కొత్తవాటిని బిగించారు. గత మూడు సంవత్సరాల కాలంలో సుమారు 25 ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ మాయం అయింది. ఈ ఏడాదిలో ఇప్పటికి ఆరు తస్కరణకు గురయ్యాయి. రైతులు విద్యుత్ అధికారులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం దొరకడంలేదు. కాగా గత సోమవారం రైతు సంఘం నాయకులు ధర్నా చేయడంతో బుధవారం కొత్తవి ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు కిట్లు అందజేత



కొణిదెనలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

బల్లికురవ: ప్రభుత్వం ప్రతి విద్యార్థికి కిట్లు అందజేసిందని నాణ్యత కలిగిన విద్యతో అత్యుత్తములుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు వస్తం నాయక్, రమేష్‌బాబు కోరారు. బుధవారం విద్యాప్రవేష్ కార్యక్రమంలో భాగంగా కొణిదెన హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీతో పలు సూచలనలు చేశారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం ఆషాఢ మాసం ఉత్తర నక్షత్రం షష్టి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



వేటపాలెం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు



బల్లికురవలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

వేటపాలెం: కార్మికుల కోర్కెల పరిష్కారం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి నూతనంగా అమల్లోకి వచ్చిన మూడు న్యాయ చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీ పథకం నిలిపివేయాలన్నారు. కార్మికులకు కనీసవేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీము అమలు, నూతన పెన్షన్స్ రద్దు, కనీస పెన్షన్ రూ.9 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఆశ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్, గెస్ట్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందనే పేరుతో నూతన ప్రభుత్వం వివిధ రకాల కార్మికులను, చిరుద్యోగులను బలవంతంగా తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించే ప్రక్రియను విరమించు కోవాలన్నారు. వివధ రంగాల్లో వేతన పెరుగుదల పెండింగ్ సమస్యలపై కార్మికులతో కుదిరిన ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు, కార్మికులతో కుదిరిన ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇండ్ల బ్రహ్మయ్య, పంచాయతీ యూనియన్ నాయకులు సురేష్, ఆంజనేయులు, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు ఏ. బ్యూలాకుమారి, పి. ప్రమీల, జె. భూలక్ష్మి, పద్మ, చిరంజీవి, మేరీ తదితరులు పాల్గొన్నారు.



కారంచేడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు



జె.పంగులూరు: తసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు



అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గ్యాట్యుటీ అమలు చేయండి

బల్లికురవ: కేంద్రం రాష్ట్రంలో అధికారం చేపట్టిన కొత్త ప్రభుత్వాలు ఐసీడీఎస్ బలోపేతంతో బడ్జెట్ పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య కోరారు. బుధవారం బల్లికురవలో తహసీల్దార్ యం. సుభద్రకు కార్యకర్తలతో కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తిస్తూ గ్యాట్యుటీ అమలు చేయాలని కనీసం వేతనం రూ. 26 వేలు, పెన్షన్ పీఎఫ్, ఈఎస్ఐ అమలుతో ప్రీసూకల్‌ను బలోపేతం చేయాలని కోరారు. 5 సంవత్సరాల్లోపు చిన్నారులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లకుండా సర్క్యులర్లు ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రయివేటీకరణ, ప్రభుత్వ రంగ ప్రవేటికరణ ఆపాలని ఎన్నికల తదుపరి కొన్ని జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులపై రాజకీయ వేధింపులను ఆపాలని ఆ వినతి పత్రంలో వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగమణి, శివపావని, సత్యవతి, సరస్వతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు, కనీస వేతన చట్టంను కచ్చితంగా అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు తహసీల్దారు కార్యాలయ ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, కార్మికులు సంయుక్తంగా నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం డిప్యూటీ తహసీల్దారు అరుణకు అందించారు. సీఐటీయూ నాయకుడు పి. కొండయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాన్ని నిలుపుదల చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్‌మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, ఆయూష్, సేంద్రీయ వ్యవసాయం, 108, 104 వంటి అన్ని రకాల కార్మికుల, ప్రభుత్వ గుర్తింపు పొందిన వారికి సామాజిక భద్రతతో పాటు, రూ. 26 వేల కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరియమ్మ, క్రీస్తురాజ్యం, రాధ, వెంకటేశ్వరరావు, బాజీ, రాజేష్, శాంతకుమారి పాల్గొన్నారు.

జె.పంగులూరు: కార్మికులు తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల కోర్కెల దినోత్సం సందర్భంగా బుధవారం పంగులూరులో సీఐటీయూ మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేసి, నూతనంగా అమల్లోకి వచ్చిన మూడు న్యాయచట్టాలను నిలుపుదల చేయాలని కోరారు. కనీస పెన్షన్ స్కీము రూ. 9 వేలకు పెంచాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 104, 108 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలను చెల్లించాలన్నారు. పెన్షన్ లాంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించి, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కంటిజెంట్, పార్ట్ టైం, గెస్ట్ కార్మికులను ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

అద్దంకి రూరల్: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు పి.తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్‌డే సందర్భంగా ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన కార్యవర్గం బుధవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రోటరీక్లబ్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. శరత్ చౌదరి కార్యవర్గం ప్రెసిడెంట్‌గా చప్పిడి వీరయ్య, కార్యదర్శిగా చుండూరి మురళీ సుధాకరరావు, కోశాధికారి మాలాది శ్రీనివాసరావుచే ప్రమాణ స్వీకారం చేయించారు. సహాయక గవర్నర్ మహమ్మద్ రఫీ 8 మంది కార్యవర్గ సభ్యులచే ప్రమాణం చేయించారు. నూతన కార్యాలయ భవనానికి 8 సెంట్ల స్థలం అందజేసిన దాత మాజీ అధ్యక్షుడు చిన్న మురళీ కృష్ణను అభినందించారు. పేద మహిళకు పరిమళ ఫౌండేషన్ చైర్మన్, రోటేరియన్ బీవీ కృష్ణారెడ్డి కుట్టుమిషన్ అందజేశారు.

నేషనల్ కెరీర్‌లో పేర్ల నమోదు



మాట్లాడుతున్న రవిశంకర్

చీరాల రూరల్: విద్యార్థులు విధిగా నేషనల్ కెరీర్ సర్వీసెస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని దత్తోపత్ ఠేంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ విజయవాడ ప్రాంతీయ సంచాలకులు ఆర్. రవిశంకర్ అన్నారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలో ఒక విభాగమైన దత్తోపత్ ఠేంగడి జాతీయ కార్మిక సంస్థ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ చీరాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చైతన్య భారతి డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పథకాల అవగాహన, నేషనల్ కెరీర్ సర్వీసెస్‌లో పేర్లు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్. రవిశంకర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. అలానే నేషనల్ కెరీర్ సర్వీసెస్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందవచ్చునని సూచించారు. ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డీ మతిన్, కళాశాల ప్రిన్సిపాల్ నార్నె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అధ్యయన తరగతులు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దర్శి: దర్శిలో జరిగే జిల్లా స్థాయి ఉద్యమ అధ్యయన తరగతులను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కోరారు. ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సైదా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరుగు జిల్లా స్థాయి, మండల స్థాయి, సబ్ కమిటీ సభ్యులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల కనుమరుగుకు కారణం అవుతున్న జీఓ నెంబర్ 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో రెండు మాధ్యమాలను కొనసాగించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13వ పీఆర్సీ వెంటనే వర్తింప చేయాలని కోరారు. అధ్యయన తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఏఎల్ ప్రసాద్, ఐదు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే ముఖ్యం



బల్లికురవలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆశ వర్కర్లు ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్‌గా ఉంచుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. బుధవారం బల్లికురవలో 104 ఉచిత వైద్య శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంలో వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల వారీగా గర్భిణులు, చిన్నారుల వివరాలతోపాటు వ్యాక్సిన్‌లు చెకప్‌ల డేటాను నమోదు చేసుకోవాలన్నారు. వర్షాల సీజన్ ఆరంభమైనందున అపారిశుద్ధ్యం కలుషిత నీటితో సీజనల్ జ్వరాలు, డయేరియా సోకే ప్రమాదం ఉందని, జ్వరపీడితులను ఎప్పటికప్పుడు సర్వేతో గుర్తించాలని వైద్యాధికారి వివరించారు.

ఫిజియోథెరపీతో వైకల్య నివారణ

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్యవ్యాయామం, ఫిజియోథెరపీతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో పది మంది చిన్నారులకు ఆమె పరీక్షలు చేశారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపుకుచిన్నారులను తీసుకురావాలన్నారు. ఐఈఆర్టీలు నాగబాబు, నాజిలి పాల్గొన్నారు.

మహిళపై దాడి.. ఏడుగురుపై కేసు నమోదు

చినగంజాం: మండలంలోని పెదగంజాం దళితవాడలో ఓ మహిళపై దాడి జరిగింది. ఈ కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎం. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వజ్రమ్మ భర్తకు.. నిందితులకు ఇటీవల ఘర్షణ జరిగింది. దీంతో తన భర్తతో ఎందుకు గొడవ పడుతున్నారని ఆమె ప్రశ్నించడంలో మంగళవారం రాత్రి నిందితులు ఆమెపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం వెళ్లింది. అక్కడ ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిందితులైన ఏసోబు, సుబ్బారావు సహా మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భక్తి మార్గంలో పయనించాలి



భిక్షాటన చేస్తున్నర భక్తసాయి బృందం

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాని సాయిబాబా ఆలయం ధర్మకర్త డాక్టర్ జీవీ నారాయణ అన్నారు. ఈ నెల 21వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని షరాబ్ బజారులో బుధవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల వద్ద నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొనడం మానసిక ప్రశాంతత సంతరించుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో అనుసరించడంతో ఆనందదాయకమైన జీవనం గడపవచ్చన్నారు. భక్త సాయిబృందం వారు రమా, హైమా పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

వేటపాలెం: మండలంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై విజిలెన్స్ అధికారులు కట్ట వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఈఈ కె. జాన్‌థామస్, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది 33 బృందాలుగా ఏర్పడి 2,500 సర్వీసులు తనిఖీ నిర్వహించారు. అధికంగా లోడు వినియోగిస్తున్న 127 కేసులు, మాల్‌ప్రాక్టిస్ 4 కేసులు, విద్యుత్ చౌర్యం ఒక కేసు మొత్తం 132 కేలు నమోదు చేశారు. వీరి నుంచి రూ. 6.35 లక్షలు జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం, చట్టరీత్యా నేరమని.. విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై దాడులు నిర్వహించి జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఈఈ జె. శ్రీనివాసులు, చీరాల డీఈఈ టి. శ్రీనివాసరావు, పర్చూరు డీఈఈ ఎస్. రమేష్, వేటపాలెం రూరల్ ఏఈఈ వి. భాస్కరరావు, చీరాల డివిజన్ ఏఈ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించండి



జె.పంగులూరు: వినతిపత్రం అందిస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

జె.పంగులూరు: కొంతకాలంగా పంచాయతీల్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని మండలంలోని కొండమూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ తానికొండ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము చాలా కాలం నుంచి స్వచ్ఛ భారత్ కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నామని, అయితే తమ జీతాలు ఏ నెలకు ఆనెల ఇవ్వడం లేదని వాపోయారు. పంచాయతీల్లో గత ఆరు నెలల నుంచి తమకు రావలసిన జీతాలు అందలేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి తల్లపనేని రామారావు, కార్మికులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు వరం



బల్లికురవలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ విజయ నిర్మల

బల్లికురవ: రైతులు వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకుని నాణ్యత కలిగిన మంచి విత్తనాల ఎంపికతో అధికదిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ బాపట్ల జిల్లా వనరుల కేంద్రా కోఆర్డినేటర్ యం. విజయనిర్మల వెల్లడించారు. బుధవారం బల్లికురవలో రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయంలో మెలుకువలపై శిక్షణ సదస్సు నిర్వహించారు. విజయనిర్మల మాట్లాడుతూ భూసార పరీక్షలు సమతుల ఎరువుల వాడకంతో ఖర్చులు తగ్గించుకోవచ్చని ఇటీవల కాలంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో కూడా మంచి దిగుబడులు సాధిస్తున్నారన్నారు. ప్రభుత్వం 30 శాతం సబ్సిడీపై కందులు, పెసలు అందిస్తుందని చెప్పారు. విత్తన డిపోల్లో కొనుగోలు చేసే పత్తి, మొక్కజొన్న కూరగాయలు ఆహారధాన్యమైన వరి విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లు తీసుకోవటంతోపాటు విత్తన సంచిని భద్రపరుచుకోవాలని కోరారు. ఖరీఫ్, రబీల్లో సాగుచేసే పంటలను పంట కాలం పూర్తి అయిన తదుపరి పంట వ్యర్థాలనను భూమిలోనే కలియదున్నాలన్నారు. కొందరు రైతులు అవగాహన లేక వ్యర్థాలను తగలబెడుతున్నారని దీనివల్ల భూమి నిస్సారం అవుతుందని కోఆర్డినేటర్ వివరించారు. ముందస్తుగా ప్రతి సాగుచేసిన రైతులు గులాబీ రంగు పురుగు నివారణకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రత్తి, మిర్చి, వరి, అపరాలు కూరగాయాల సాగులో మెలుకువలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మెహన్ శాస్త్రవేత్తలు రాధాకృష్ణ, ఉషారాణి సమన్వయకర్త మురళీధర్ జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ రత్నకుమారి, స్థానిక వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి రైతులకు అవగాహనతో వివరించారు.

ఆర్మస్ట్రాంగ్ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు

చీరాల రూరల్: తమిళనాడు రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్మస్ట్రాంగ్ హత్యను నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గడియార స్తంభం సెంటర్లోని కాన్షీరాం విగ్రహం వద్ద నుంచి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటి మార్కు, గొర్రెపాటి రవికుమార్, సిర్రా భగత్‌సింగ్ మాట్లాడారు. తమిళనాడు రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి ఆర్మస్ట్రాంగ్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఆయన ఎంతో సౌమ్యుడని చిన్ననాటినుండి ఎంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరాడని చెప్పారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అర్జునరావు, ఏసు, అరుణ్, వెంకటస్వామి, సురేష్, చిన్న, దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపండి



హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై హరిబాబు

చీరాల రూరల్: హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి ప్రాణాలను కాపాడుకోవాలని ట్రాఫిక్ ఎస్సై పి. హరిబాబు వాహనదారులకు సూచించారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఎస్సై హరిబాబు పాల్గొని వాహనదారులకు నూతన చట్టాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను ప్రజలు అవగాహన చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్, మైనర్ల రైడింగ్, రెక్లెస్ డ్రైవింగ్, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, అటువంటి నేరాలుచేసి పట్టుబడితే భారీ స్థాయిలో జరిమానాలు, శిక్షలు ఉంటాయని చెప్పారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు, సదస్సులో కోర్టు లోక్అదాలత్ సిబ్బంది రాఘవ పారా లీగల్ వాలంటీర్ యస్‌డి.మతిన్, కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.